ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బర్కత్‌పుర చమాన్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ వాడకం, త్రిబుల్ రైడింగ్, పెండింగ్ చాలన్లపై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ చాలన్లు సకాలంలో చెల్లించాలని సూచించారు. కుటుంబసభ్యులను దృష్టిలో పెట్టుకొని నడపాలని విజ్ఞప్తి చేశారు.

- కాచిగూడ

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ బుధవారం అసదుద్దీన్ ఒవైసీని కలిసి పెండింగ్ అభివృద్ధి పనుల వివరాలు తెలిపారు.

- మెహిదీపట్నం

నిలిచిన పార్శీగుట్ట రోడ్డు పనులు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ముషీరాబాద్, మే 22 : ముషీరాబాద్ డివిజన్ రాంనగర్ – పార్శీగుట్ట రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా వేసి కొద్ది దూరం తవ్వి వదిలివేయడంతో పార్శీగుట్ట మార్గంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతున్నది. మూడు నెలల క్రితం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రూ. 70 లక్షల వ్యయంతో రాంనగర్ – పార్శీగుట్ట మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. తొలుత రోడ్డు నిర్మాణ పనుల వేగంగా చేపట్టిన అధికారులు ఆ తర్వాత స్థానికులు డ్రైనేజీ పైపులైన్ పూర్తయ్యే వరకు రోడ్డు నిర్మాణం ఆపాలని కోరడంతో పనులు కొద్ది రోజులు నిలిచిపోయాయి. పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాల్సిన గుత్తేదారు నత్తనడకన పనులు చేపడుతున్నారు. ఇటీవల పార్శీగుట్ట శ్మశాన వాటిక నుంచి రాంనగర్ బ్రహ్మంగారి టెంపుల్ కమాన్ వరకు తవ్విన గుత్తేదారు కొంత దూరం వదిలి రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డంతా వేసి కొద్ది దూరం వదిలిపెట్టడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద ఎత్తున తవ్విన గుంతలో నుంచి వెళ్లడానికి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

గుత్తేదారుల సమ్మె కారణంగా ఆలస్యం..

బిల్లులు చెల్లించాలంటూ గుత్తేదారులు సామూహికంగా పనులు చేపట్టకపోవడం వలన పార్శీగుట్ట రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎన్నికల పోలింగ్ బూత్ ఉన్న సెయింట్ పాయిస్ స్కూల్ మార్గంలో తాత్కాలికంగా పనులు నిలిపివేశాం. త్వరలోనే మిగతా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.

- మురళి, ఏఈ జీహెచ్ఎంసీ సర్కిల్-15

తవ్వి వదిలేసిన పార్శీగుట్ట – రాంనగర్ రోడ్డు దృశ్యం

పిల్లలకు ఆటపాటలు అవసరం

కార్యక్రమంలో మాట్లాడుతున్న చొక్కపు వెంకటరమణ

చిక్కడపల్లి, మే 22 : తెలంగాణ బాలోత్సవం సందర్భంగా 18 రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చొక్కాపు వెంకటరమణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఆటస్థలాలు లేవని, దీంతో చిన్నారులు ఆటపాటలకు దూరం అవుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొయ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. పిల్లలు అన్నిరంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహం, సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య, ఉపాధ్యక్షురాలు సుజావతి, మమత, పద్మ, జి.బుచ్చిరెడ్డి, నవీన్, గోపాల్, భవాని, మానస పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ అఫ్జల్‌సాగర్‌లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో అధికారులు స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అఫ్జల్‌సాగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య తలెత్తి సరఫరా నిలిచి పోయిందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో డీఈ శ్యాంసుందర్ రెడ్డి అక్కడి ఏఈని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఏఈ సిబ్బందితో వెళ్లి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

- మెహిదీపట్నం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, మే 22 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని 11కేవీ హకీంపేట్ ఫీడర్,11 కేవీ కాకతీయనగర్ ఫీడర్,11 కేవీ మారుతీనగర్ ఫీడర్ ,11 కేవీ నేతాజీనగర్ ఫీడర్,11 కేవీ టోలిచౌకి ఫీడర్,11 కేవీ నీరజా కాలనీ ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 నుంచి
మధ్యాహ్నం 12 : 30 గంటల వరకు

హకీంపేట్, అల్ హస్నత్ కాలనీ, యూసుఫ్ టేక్డి, మిరాజ్ కాలనీ, మిలటరీ ఏరియా, మందార్ రెస్టారెంట్ ప్రాంతాలు

మధ్యాహ్నం 12 : 30 నుంచి 2 గంటల వరకు

కాకతీయనగర్, సాలార్జంగ్ కాలనీ, మొఘల్ హైట్స్, అల్ కరీం కాలనీ, విరాసత్ నగర్ కాలనీ, ఒవైసీ పార్కు ప్రాంతాలు

మధ్యాహ్నం 2 :30 నుంచి
సాయంత్రం 4 గంటల వరకు

మారుతీనగర్, ఓంనగర్ ప్రాంతాలు

మధ్యాహ్నం 3 : 30 నుంచి
సాయంత్రం 5 గంటల వరకు

నేతాజీనగర్, శ్రీనివాస్ నగర్, జ్యోతినగర్, సర్దార్ బాగ్, మొఘల్ కా నాలా ప్రాంతాలు

మధ్యాహ్నం 12 నుంచి 12: 40 గంటల వరకు

అల్ హస్నత్ కాలనీ,యూసుఫ్ టేక్డి, నిజాం కాలనీ, టోలిచౌకి, డీలక్స్ కాలనీ, దౌలత్ గుల్షన్ కాలనీ, బడాజానకీనగర్, కేఎఫ్‌సీ ప్రాంతాలు

మధ్యాహ్నం 3 నుంచి 3 : 45 గంటల వరకు

నీరజా కాలనీ, మహబూబ్ గార్డెన్, ఛాబ్రా ఎన్‌క్లేవ్, అక్బర్ బాగ్,గ్రామర్ కాలనీ ప్రాంతాలు

ముషీరాబాద్, మే 22 : టీఎస్ఎస్‌పీడీసీ ఆజామాబాద్ డివిజన్ 11 కేవీ బర్కత్‌పుర బస్‌డిపో, సీసీ షరాఫ్, బౌద్ధనగర్, జామై ఉస్మానియా ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా గురువారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం.విజయభాస్కర్ తెలిపారు.

ఉదయం 11 నుంచి 12 : 30గంటల వరకు

బర్కత్‌పుర బస్‌డిపో ఫీడర్ పరిధిలోని బర్కత్‌పుర బస్సు డిపో లైన్, రత్నానగర్, సత్యానగర్, బీజేపీ ఆఫీసు, అవంతి డిగ్రీ కాలేజ్, కాచిగూడ జూనియర్ కాలేజ్, ఉడ్ల్యాండ్ ఆసుపత్రి పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

మధ్యాహ్నం 12: 30 నుంచి 2 గంటల వరకు

సీసీ షరాఫ్ ఫీడర్ పరిధిలోని భూమన్న గల్లీ, సీసీ షరాఫ్ ఆసుపత్రి, రాజేంద్రనగర్ కాలనీ, లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 2:30 నుంచి 4 గంటల వరకు

బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలోని వారాసిగూడ, బౌద్ధనగర్, కౌసర్ మసీదు, జామై ఉస్మానియా మొయిన్ రోడ్, బాలాజీ కమ్యూనిటీహాల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు

జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలోని ఎస్‌బిహెచ్ కాలనీ, జామై ఉస్మానియా, లలితానగర్, అడిక్‌మెట్ పరిసర పాంతాల్లో కరెంటు సరఫరా ఉండదు.

శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఐఏఎస్ దానకిశోర్‌ను బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, యూజీసీ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, ఓయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రాజేందర్‌నాయక్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- సుల్తాన్‌బజార్

సన్మానం

టీఎన్జీవో కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశం నిమిత్తం నగరానికి విచ్చేసిన టీఎన్జీవో ఆదిలాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్.అశోక్, కార్యదర్శి నవీన్, నిర్మల్ జిల్లా శాఖ అధ్యక్షుడు వి. ప్రభాకర్, కార్యదర్శి ఎన్.రవికుమార్‌ను బుధవారం తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘం భవనంలో అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘం గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బిన్ హసన్, నగర శాఖ కార్యదర్శి జి.శ్రీనివాస్, నాయకులు బి.రాజేందర్, సయ్యద్ ఖలీల్, సుధాకర్ పాల్గొన్నారు.

- సుల్తాన్‌బజార్

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, మే 22 : చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి పూజలు చేశారు. కార్యనిర్వహణాధికారి కె.రామాంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడి కుమారుడు జి.శ్రీనాథ్ గౌడ్ కార్యక్రమాలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు 31 వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 26న స్వామి వారి కల్యాణం, 27న రాత్రి స్వామి వారి గరుఢ వాహన సేవ, 28 శ్రీ స్వామివారి శృంగార రథోత్సవం, 30న శ్రీ స్వామివారి అభిషేకం, 30న స్వామివారి శృంగార డోలోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

పాన్‌షాపు యాజమానులకు సూచనలు ఇస్తున్న కాచిగూడ డివిజన్ ఏసీపీ రఘు

కాచిగూడ, మే 22 : చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని కాచిగూడ ఏసీపీ వి.రఘు హెచ్చరించారు. పీఎస్ పరిధిలోని పాన్‌షాపు యాజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏసీపీ రఘు మాట్లాడుతూ.. పాన్‌షాపు యాజమానులు నిషేధిత గుట్కాలు, మత్తు సిగరెట్టు, చాక్లెట్లు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపులు రోజు రాత్రి 11 గంటలకు మూసివేయాలని సూచించారు. కార్యక్రమంలో కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ పాల్గొన్నారు.

మురుగునీటి ప్రవాహానికి అడ్డుకట్ట

విజయ్‌నగర్ కాలనీ డివిజన్ ఆసిఫ్‌నగర్ ప్రధాన రోడ్డు, దీన్‌దార్ అంజుమన్ లో మురుగునీటి ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో జలమండలి అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. డీజీఎం వికాస్ సిబ్బందితో మధ్యాహ్నం అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. పేరుకుపోయిన బురదను తొలగింప చేశారు. ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి డాక్టర్ షేక్ ఖాసీం అధికారుల పనితీరుపై ఆనందం వ్యక్తం చేశారు.

- మెహిదీపట్నం

వ్యక్తి అదృశ్యం

కాచిగూడ : భార్యభర్తలు గొడవపడి భర్త అదృశ్యమైనాడు. కాచిగూడ అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌బజార్‌కు చెందిన బాబిలాల్ కుమారుడు రాజన్ పాశ్వాన్ బర్కత్‌పురలోని గోకుల్‌దామ్ అపార్ట్‌మెంట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14న భార్యతో గొడవపడి బర్కత్‌పురకు వచ్చాడు. ఇంటికి రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో భార్య అంబిక బుధవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంట్లోంచి అతడు వెళ్లే సమయంలో ఎరుపు చొక్క, కాకి రంగు ప్యాంట్ ధరించాడని, ఎత్తు 5.4 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కాచిగూడ : ప్రమాదవశాత్తు రైల్లోంచి పడిన బాలిక తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం.. రాజ్‌మోల్లాకు చెందిన రమేశ్ కూతురు గువ్వ విజయ(15) 7వ తరగతి చదువుతున్నది. 20న కుటుంబ సభ్యులతో కలిసి లింగంపల్లికి వెళ్లేందుకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు ఎక్కారు. అయితే, తండ్రి రైలు ఎక్కకపోవడంతో కూతురు కిందకి దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన విజయను గాంధీ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపారు.

యువకుడిపై చాకుతో దాడి

కాచిగూడ : పాత కక్షలతో డబీర్‌పుర రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడిపై దాడిచేసిన ఇద్దరిపై కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ యల్లప్ప కథనం ప్రకారం.. యాకత్‌పుర నివాసి మహ్మద్ ఫైజ్ ఖాన్ కారు డ్రైవర్. బుధవారం స్నేహితుడితో కలిసి ఫైజ్‌ఖాన్ డబీర్‌పుర రైల్వేస్టేషన్‌లో కూర్చున్నాడు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని ఇదే అదునుగా భావించిన మహ్మద్ రోహన్, దావూద్ జాబ్రీ కలిసి ఫైజ్‌ఖాన్‌పై చాకుతో దాడి చేసి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఘనంగా శ్రీలక్ష్మీనృసింహ స్వామి జయంతి

తెలుగు యూనివర్సిటీ : రెడ్‌హిల్స్‌లోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ...

కార్వాన్‌లోని ప్రాచీన నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి జయంతి పూజా కార్యక్రమంలో పాల్గొని భజన గీతాలు ఆలపిస్తున్న భక్తులు, నిర్వాహకులు.

అంబర్‌పేట, మే 22 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలోని అహోబిలమఠంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వైశాఖమాస శుక్లపక్షం చతుర్దశి రోజున ఈ జయంతిని నిర్వహిస్తారు. స్వామివారికి డివిజన్ కార్పొరేటర్ బి.పద్మ, సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

భోజగుట్ట ఆలయంలో జయంతి ఉత్సవాలు

మెహిదీపట్నం : నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం భోజగుట్ట నృసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి జయంతి ఉత్సవాలను భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు. నిర్వాహకులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అయ్యప్ప సేవకులు హనుమంత్‌రావు ముదిరాజ్, కునాల్, మురళి, ప్రేమ్ పాల్గొన్నారు.

తెలుగు యూనివర్సిటీ, మే 22 : రెడ్‌హిల్స్‌లోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నృసింహ స్వామి జయంతి మహోత్సవం ఆధ్యాత్మిక వాతావారణంలో బుధవారం జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు బాబూరావు, అర్జున్, భాస్కర్, సన్నీ, గిరిధర్, యోగేశ్ నేతృత్వంలో ఉదయం నుంచి జరిగిన పూజా కార్యక్రమాలలో భాగంగా అభిషేకం, హోమం, సత్యనారాయణ స్వామి వ్రతంతో పాటు సాయంత్రం పల్లకీ ఊరేగింపు, హారతి నైవేద్య సమర్పన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కార్వాన్‌లోని నృసింహాలయంలో..

కార్వాన్, మే22 : నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకొని కార్వాన్‌లోని ప్రాచీన నరసింహ స్వామి ఆలయంలో బుధవారం పూజలు, హోమం నిర్వహించారు. అన్న ప్రసాద పంపిణీ చేశారు. ఆలయంలో భజన గీతాలపానలు ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు సమస్యలు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

అహోబిలమఠంలో జరిగిన శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి



భోజగుట్ట నృసింహ స్వామి ఆలయంలో జయంతి ఉత్సవాల సందర్భంగా దర్శించిన భక్తులు

భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 22: జీవితమంతా దళితుల అభ్యున్నతికి కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతిని ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్(అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సైదులు మాట్లాడుతూ.. భాగ్యరెడ్డివర్మ నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు. నగరంలో ఆది ఆంధ్రసభ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ సంస్థలను స్థాపించి తెలంగాణ వైతాళికుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాదులు వేశారని గుర్తు చేశారు. దేశంలో దళిత చైతన్యానికి నాంది పలికిన మహానుభావుడు భాగ్యరెడ్డివర్మ అని ప్రశంసించారు. ఉద్యమకారుడిగా, హక్కుల కార్యకర్తగా, రచయితగా, పాత్రికేయుడిగా, సంఘసంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞాశీలిగా సేవలందించారని పేర్కొన్నారు. తెలంగాణలో జోగిని, దేవదాసి వంటి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించారని కీర్తించారు. బహుజనులే ఆది హిందువులని, ఈ విషయాన్ని అంబేద్కర్ కంటే ముందుగానే భాగ్యరెడ్డివర్మ పేర్కొన్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎన్ఎం శ్రీకాంత్‌యాదవ్, ఉదయ్, గోపి, బసవరాజు, శ్రీను, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

మేడ్చల్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శ్రీ ఎం.వీ భాగ్యరెడ్డి వర్మ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి.వినోద్‌కుమార్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.